క్లుప్తంగా

ఏడుగురు వలంటీర్ల రాజీనామా



చేబ్రోలు: మండలంలోని వడ్లమూడి గ్రామ రెండో సచివాలయం వలంటీర్లు ఏడుగురు శుక్రవారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను ఎంపీడీవో కార్యాలయంలోని అధికారులకు అందజేశారు. తలకాల సుబ్బారావు, యార్లగడ్డ మహేష్, మార్పు కిరణ్, వి.ఉష, డి.భ్రమరాంబ, యు.అనూరాధ, ఎం.రాజేశ్వరి రాజీనామా చేసిన వారిలో ఉన్నారు. గత రెండు నెలలుగా ప్రతిపక్ష పార్టీ నాయకులు కించపరుస్తూ, ఇబ్బందులు గురిచేస్తుండటంతో వలంటీర్లుగా రాజీనామాలు చేస్తున్నట్లు వారు తెలిపారు.

ఆర్వీఆర్‌జేసీ అధ్యాపకుడికి డాక్టరేట్



గుంటూరు రూరల్: అధ్యాపకుల లక్ష్య సాధనకు తమ కళాశాల ఎల్లప్పుడూ కృషిచేస్తుందని ఆర్వీఆర్ జేసీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన అధ్యాపకుని అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. తమ కళాశాల అధ్యాపకుడు యంపరాల సుమంత్‌కు అన్నామలై విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రధానం చేసిందని తెలిపారు. పర్ఫార్మెన్స్ ఎన్‌హాన్స్‌మెంట్ ఆఫ్ డబుల్ ఫెడ్ ఇండక్షన్ జనరేటర్ బేస్డ్ విండ్ ఎనర్జీ కన్వర్షన్ సిస్టమ్ బై ఆప్టిమల్ డిజైన్ ఆఫ్ ఎఫ్ఓపీఐడీ కంట్రోల్ అనే అంశంపై డాక్టర్ ఎల్.లక్ష్మినరశింహన్, డాక్టర్ జి.సాంబశివరావు పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించిందన్నారు. కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, కార్యదర్శి ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎస్వీ శ్రీనివాసరావు, డాక్టర్ కె చంద్రశేఖర్ తదితరులు అభినందించారు.

మూలాంకురేశ్వరికి విశేష పూజలు



ఫిరంగిపురం: మండలంలోని అమీనాబాద్ గ్రామంలోని మూలాంకురేశ్వరి అమ్మవారికి చైత్రబహుళ ఏకాదశిని పురస్కరించుకొని శుక్రవారం విశేష పూజలు చేశారు. ప్రాతఃకాలంలో అర్చకులు అయ్యన్నశాస్త్రి అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. పసుపు, కుంకుమలతో లలితా అష్టోత్తర, సహస్ర నామ పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పంట కాలువల్లో పూడికతీత పనులు

ఫిరంగిపురం: మండలంలోని 17 గ్రామాల్లో ఉపాధిహామీ పనులు వేగంగా జరుగుతున్నాయి. వర్షాకాలంలో పంట కాలువల వల్ల ఇబ్బందులు తలెత్తకుండా ఉపాధి కూలీలు పూడికతీత పనులు చేపడుతున్నారు. అన్ని గ్రామాల్లో పంట కాలువల పూడికతీత పనులతో పాటు పొలాల్లో నీటి కుంటలు ఏర్పాటు చేసేందుకు వీలుగా తవ్వకాలు నిర్వహిస్తున్నామని ఉపాధి హామీ అధికారులు చెబుతున్నారు. వేసవికాలం కావడంతో వడదెబ్బ తగలకుండా ఓఆర్ఎస్ ప్యాకెట్లు , ప్రథమ చికిత్సకు అవసరమైన మందులు ఫీల్డు అసిస్టెంట్ల వద్ద ఉన్నట్లు చెప్పారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 13 మంది ఎంపిక

గుంటూరు ఎడ్యుకేషన్: సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాల ప్రాంగణంలోని జవహర్ విజ్ఞాన కేంద్ర ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 13 మంది ఎంపికయ్యారు. ఐటీఎం స్కిల్స్ అకాడమీ సంస్థ ఐసీఐసీఐ బ్యాంకులో రిలేషన్ షిప్ మేనేజర్ ఉద్యోగాలకు నిర్వహించిన ఇంటర్వ్యూలకు వివిధ కళాశాలల నుంచి 37 మంది రాత, మౌఖిక పరీక్ష నిర్వహించి 13 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. కంపెనీ ప్రతినిధులు మరో 15 మందిని తదుపరి ప్రక్రియకు ఎంపిక చేశారు. హెచ్ఆర్ మేనేజర్లు షహీనా, కళావతి నిర్వహించిన ఇంటర్వ్యూల ప్రక్రియను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి, జేకేసీ సమన్వయకర్త డాక్టర్ కె.అపర్ణ సీతారామ్, మెంటార్లు మూనిస్‌ఖాన్, కె.అపర్ణ పర్యవేక్షించారు.

వాహనాల తనిఖీలు

పట్నంబజారు: ఎన్నికల ప్రక్రియలో భాగంగా గుంటూరు జిల్లాలో రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ (ఆర్టీఏ) అధికారులు ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. శుక్రవారం గుంటూరు బుడంపాడు బైపాస్, నల్లచెరువు, పొన్నూరు రోడ్డు ప్రాంతాల్లో ఆర్టీఓలు ఎం.గోపాల్, ప్రసాద్, ఎంవీఐలు రాఘవరావు, అనిల్‌కుమార్, మల్లేశ్వరి, సంధ్య, సౌజన్యలతో కలిసి ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా డీటీసీ షేక్ కరీం మాట్లాడుతూ వాహనాల తనిఖీలు నిత్యం కొనసాగుతాయని తెలిపారు.

అంబటికి అపూర్వ ఆదరణ

- ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్న వైఎస్సార్ సీపీ
- ఈ ఎన్నికలతో టీడీపీ కనుమరుగు
- ఓటమి భయంతో ప్రచారానికి దూరమైన ధూళిపాళ్ల
- పొన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ



వల్లభరావుపాలెంలో ప్రచార రథంపై మాట్లాడుతున్న అంబటి మురళీకృష్ణ

పొన్నూరు: ప్రజలకిచ్చిన హామీలను ఐదేళ్లలో నెరవేర్చాం కాబట్టే.. ప్రజల్లోకి వెళ్లి ధైర్యంగా ఓట్లడుగుతున్నామని వైఎస్సార్ సీపీ పొన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని నండూరు, ఇటికంపాడు, పెద్దపాలెం, సీతారామపురం, మన్నవ గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మహిళలు హారతులు పట్టారు. బైక్ ర్యాలీతో నాయకులు, యువకులు ఘన స్వాగతం పలికారు. సాయంత్రం వల్లభరావుపాలెంలో జెడ్పీటీసీ సభ్యులు కర్లపూడి రమేష్ ఆధ్వర్యంలో ప్రజలు అంబటి మురళీకృష్ణకు బ్రహ్మరథం పట్టారు. ప్రచార వాహనంలో అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ 2019 మేనిఫెస్టోలోని హామీలను సీఎం జగన్ పూర్తిస్థాయిలో నెరవేర్చారన్నారు. పొన్నూరు నియోజకవర్గంలో రూ.1679 కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. దీంతో ప్రతి కుటుంబం ఆర్థికంగా బలపడిందన్నారు. ప్రజల మద్దతు వైఎస్సార్ సీపీకే ఉందన్నారు. సంక్షేమ పథకాలతో మంచి జరిగిన కుటుంబాలు ఈ ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌ను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. సంక్షేమ పథకాలు యథావిధిగా కొనసాగాలంటే మే 13న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై రెండు ఓట్లు వేసి, ఎంపీ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య, ఎమ్మెల్యే అభ్యర్థి అయిన తనను గెలిపించాలని అభ్యర్థించారు. ఈ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభంజనంతో పొన్నూరులో టీడీపీ కనుమరుగవుతుందన్నారు. ఓటమి భయంతో ధూళిపాళ్ల ఇప్పటికే ప్రచారానికి స్వస్తిపలికారని చెప్పారు. ప్రచారంలో మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ ఎస్. రూత్‌రాణి, నాయకులు దాసరి శివరామకృష్ణ, దాసరి నారాయణరావు, షేక్. నాజర్, బొనిగల వేణుప్రసాద్, వడ్రాణం ప్రసాద్, దాసరి నారాయణరావు, మొల్లకరీం కార్యకర్తలు పాల్గొన్నారు. పట్టణంలోని 19,4,5,6,7,15 వార్డులలో అంబటి మురళీకృష్ణ కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులు ముమ్మర ప్రచారం నిర్వహించారు. కూరగాయల మార్కెట్‌లోని వ్యాపారులను పలకరించి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. కుటుంబ సభ్యులు ప్రత్యూష, సందీప్, ప్రశాంతి, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎంఏ మహమూద్, అంజుమన్ అధ్యక్షుడు షేక్. మాము, ఏఎంసీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, నాయకులు షేక్. సలీమా బేగం, షేక్. షర్మిల, అనిలా కుమారి, షేక్. సుభాని, అబ్దుల్ ఖాదర్, షేక్. జానిబాష, బోయి నాగరాజు, అంబటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



ఇటికంపాడులో అంబటికి పూలతో ఘనస్వాగతం పలికిన గ్రామస్తులు

‘బలసాని’కి మద్దతుగా ఎన్నికల ప్రచారం



ప్రచారంలో వైఎస్సార్ సీపీ నాయకులు

ప్రత్తిపాడు: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎం చేసుకోవడమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ శ్రేణులు కదంతొక్కుతున్నాయి. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులో శుక్రవారం సాయంత్రం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు స్థానిక ఒకటి, రెండు, మూడు, నాలుగు, ఐదు వార్డుల్లో ఇంటింటికీ తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నవరత్నాలు ప్లస్‌తో పాటు నూతన మేనిఫెస్టోను ప్రజలకు వివరిస్తూ, పార్టీ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలు నిర్విరామంగా కొనసాగుతాయని ప్రజలకు వివరించారు. వైఎస్సార్ రైతు భరోసా, విద్యాదీవెన, వసతిదీవెన, ఆరోగ్యశ్రీ, పింఛన్ల పెంపు, పేదలందరికీ ఇళ్లు, అమ్మఒడి, వంటి పథకాలతో ప్రతి ఇంటా సంక్షేమ వెలుగులు విరజిమ్ముతాయన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్‌ను, ఎంపీ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్యను ఫ్యాను గుర్తుపై రెండు ఓట్లు వేసి, అఖండ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.ఈ కార్యక్రమంలో బాపతు వెంకటరమణ, గంగిరెడ్డి పరమారెడ్డి, మామిళ్లపల్లి ఆంజనేయులు, పోపూరి రామారావు, చేవర్తి లక్ష్మణ, వేలూరి లక్ష్మారెడ్డి, బాపతు గోవింద్‌రెడ్డి, షేక్ బాషా, షేక్ మాలిక్, పఠాన్ సబ్జాఖాన్, కొసిరెడ్డి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

జాగ్రత్తలతో వడదెబ్బ నుంచి ఉపశమనం

ఫిరంగిపురం: వేసవికాలంలో తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా వడదెబ్బకు దూరంగా ఉండవచ్చని వైద్యురాలు ఎస్తేరురాణి అన్నారు. మండలంలోని 113తాళ్లూరు గ్రామంలో శుక్రవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా ఫిరంగిపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. 202 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. వడదెబ్బ వల్ల ఇబ్బందులు పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి రోగులకు వివరించారు. ఎండవేడి అధికంగా ఉండటంతో వృద్ధులు, చిన్నారులు, గర్భిణులు, బాలింతలు బయట తిరగ కూడదని చెప్పారు. చలివేంద్రాల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని వడదెబ్బ తగిలిన వారు ఓఆర్ఎస్ ప్యాకెట్లు తాగాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటరమణ, హెచ్‌వీ అన్నమేరి, ఎంఎల్‌హెచ్‌పీ సాగర్‌రాణి, ఏఎన్ఎం సరోజ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

• ఇంటి వద్దే తొలి ఓటు పడింది..



వెనిగండ్లలో ఓటు వేస్తున్న వృద్ధురాలు కొల్లి సీతారావమ్మ



వెనిగండ్లలో ఓటు వేసి, సిరా చూపుతున్న కొల్లి గోపిరెడ్డి

పెదకాకాని: ఓట్ ఫ్రం హోంలో భాగంగా మండలంలో శుక్రవారం 39, శనివారం 35 ఓట్లు మొత్తం 74 ఓట్లు వృద్ధులు, మానసిక పరిస్థితి సరిగా లేని వారు చేత వేయించాల్సి ఉంది. ఇందులో భాగంగా నాలుగు బృందాలు తొలిరోజు కొప్పురావూరు, వెనిగండ్ల, నంబూరు, పెదకాకాని, తక్కెళ్ళపాడు గ్రామాల్లో ఓటర్ల ఇంటికి వెళ్లి.. ఇష్టమైన పార్టీకి బ్యాలెట్ పేపర్‌పై టిక్ పెట్టిస్తున్నారు. తొలిరోజు 39 ఓట్లకు గాను 36 ఓట్లు వేయించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల సిబ్బంది, నోడల్ అధికారులు, పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యావంతులు సామాజిక స్పృహతో మెలగాలి

సామాజిక రంగ ప్రముఖుల సమ్మేళనంలో సందేశమిచ్చిన వక్తలు



సమ్మేళనంలో ప్రసంగిస్తున్న నిషాంత్ అగర్వాల్

మంగళగిరి: ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో శుక్రవారం విద్యావంతులు, సామాజిక రంగ ప్రముఖుల ప్రత్యేక సమ్మేళనం నిర్వహించారు. ఈశ్వరీ స్కూల్ ఆఫ్ లిబరల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చర్చాగోష్టి కార్యక్రమానికి దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రఖ్యాత విద్యావంతులు, సామాజిక రంగ ప్రముఖులు హాజరయ్యారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ లిబరల్ ఆర్ట్స్ ప్రొఫెసర్ డాక్టర్ వందనా స్వామి, డీన్ ఆచార్య విష్ణుపథ్‌ల పర్యవేక్షణలో చర్చాగోష్టి కార్యక్రమం ఆసక్తికరంగా సాగింది. ప్రఖ్యాత విద్యా సంస్థ అక్సాష్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అమితాబ్ బెహర్ ముఖ్య అతిథిగా దృశ్య మాధ్యమ పద్ధతిలో హాజరయ్యారు. పౌర సమాజ పురోగతిలో సామాజిక రంగ ప్రముఖుల పాత్ర ప్రశంసనీయమని, ప్రజాస్వామ్య పరిరక్షణలో సామాజిక రంగం ప్రధాన పాత్ర పోషిస్తుందన్నారు. జాతి పురోగతికి దోహదపడే సామాజిక బాధ్యతల్ని విద్యావంతులు, విద్యార్థులు విస్మరించకూడదని హితవు పలికారు. ప్రఖ్యాత విద్యా సంస్థల ప్రతినిధులు లిబీ జాన్సన్, సూరజ్ జాకబ్, రోనక్ షా, నిషాంత్ అగర్వాల్, యామినీ అయ్యార్ తదితరులు సమాజానికి దోహదపడే వివిధ సామాజిక రంగ అంశాలపై సమీక్ష నిర్వహించారు.

ఉద్యోగాలకు 30 మంది ఎంపిక

గుంటూరు ఎడ్యుకేషన్: అమరావతిరోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన గ్లాండ్ ఫార్మా సంస్థ నిర్వహించిన పూల్ క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో బీ ఫార్మసీ చివరి సంవత్సరం చదువుతున్న 30 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం తెలిపారు. గ్లాండ్ ఫార్మా హెచ్ఆర్ జనరల్ మేనేజర్ కె. శాంతి కిరణ సారథ్యంలో ప్రొడక్షన్ అండ్ క్వాలిటీ కంట్రోల్ ఎస్యూరెన్స్ ట్రైనీ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు నిర్వహించిన రాత పరీక్ష, ఇంటర్వ్యూల్లో పాల్గొన్న 90 మంది విద్యార్థుల్లో 30 మందిని ఎంపిక చేశారని పేర్కొన్నారు. విద్యార్థులను కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కరస్పాండెంట్ డాక్టర్ ఎస్. మధుసూదనరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రవికుమార్, ప్లేస్‌మెంట్ సెల్ కో–ఆర్డినేటర్ డి. బ్రహ్మ శ్రీనివాసరావు, ఓఎస్డీ డాక్టర్ పి.సీతారామయ్య అభినందించారు.

రోటరీ కరావలంబన ట్రస్టు ఏర్పాటు



రోటరీ కరావలంబన ట్రస్ట్ లోగోను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

మంగళగిరి: సమాజ హితం కోసం చేసే పలు సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలనే సంకల్పంతో ‘రోటరీక్లబ్ ఆఫ్ మంగళగిరి’ ఆధ్వర్యంలో మంగళగిరి రోటరీ కరావలంబన ట్రస్ట్‌ను రోటరీ జిల్లా గవర్నర్ శరత్ చౌదరి ప్రారంభించి రూ.లక్ష విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ అనిల్ చక్రవర్తి మాట్లాడుతూ రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి వారు చేస్తున్న సర్వీసు ప్రాజెక్ట్‌లకు నిధులు సమకూర్చుతున్న పలువురు దాతలు, సంస్థలకు ఆదాయపన్ను రాయితీలు, కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిబంధనలకు అనుగుణంగా నిధుల వినియోగానికి అర్హత వంటి ప్రయోజనాలను ఈ ట్రస్ట్ ద్వారా కల్పించవచ్చునన్నారు. నగరంలోని గణపతినగర్‌లో రోటరీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మంగళగిరి రోటరీ కరావలంబన ట్రస్ట్ లోగోను ఏ డీజీఈ శరత్ చౌదరి, పీడీజీ అన్నే రత్నప్రభాకర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి అధ్యక్షులు అందే రేవంత్, కార్యదర్శి గాజుల శ్రీనివాసరావులతో పాటు రోటరీ ప్రతినిధులు అందె మురళి, పారేపల్లి నిరంజన్ గుప్తా, మాజేటి వంశీ కృష్ణ, ప్రగడ రాజశేఖర్, వడ్లమూడి శ్రీనివాసరావు, కాపరౌతు సుందరయ్య, దామర్ల సతీష్ పాల్గొన్నారు.

వేసవి శిక్షణతో సృజనాత్మక నైపుణ్యాలకు పదును

గుంటూరు ఎడ్యుకేషన్: బాలల్లో దాగిన సృజనాత్మక నైపుణ్యాలకు పదును పెట్టేందుకు వేసవి శిక్షణ శిబిరాలు దోహదం చేస్తాయని హైదరాబాద్‌కు చెందిన లిటిల్ ఎడ్యు ఎంటర్‌ప్రైజెస్ సీఈఓ రమణకుమార్ పేర్కొన్నారు. అరండల్‌పేట ఆరోలైనులోని హిందూ పబ్లిక్ స్కూల్లో శుక్రవారం లిటిష్ ఎడ్యు సంస్థ ఆధ్వర్యంలో చిన్నారులకు వేసవి శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈసందర్భంగా రమణకుమార్ మాట్లాడుతూ హైదరాబాద్ కేంద్రంగా లిటిష్ సంస్థ చిన్నారుల్లో దాగి ఉన్న సృజనాత్మకత నైపుణ్యాలను వెలికితీసేందుకు వేసవి శిక్షణ తరగతులను నిర్వహిస్తున్న విధంగా గుంటూరు నగరంలోని చిన్నారుల కోసం హిందూ పబ్లిక్ స్కూల్లో ఈ శిక్షణ తరగతులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హిందూ ప్రాథమికోన్నత పాఠశాల కార్యదర్శి రామకృష్ణ పరమహంస మాట్లాడుతూ చిన్నారుల్లో ఆహ్లాదాన్ని పంచేందుకు డ్యాన్స్, ఏరోబిక్స్, వేద గణితం, చిత్రకళతో పాటు చిన్నారులను నైపుణ్యవంతులుగా తీర్చిదిద్దేందుకు వివిధ అంశాల్లో శిక్షణ కల్పిస్తున్నట్లు తెలిపారు.

పండుటాకులు.. పింఛను పాట్లు



పెదకాకానిలోని ఓ బ్యాంకులో పడిగాపులు గాస్తున్న వృద్ధులు

పెదకాకాని: మండలంలోని 12 గ్రామాల్లో ఇప్పటి వరకు 10,334 మంది లబ్ధిదారులు పింఛను నగదు అందుకున్నారు. టీడీపీ నాయకులు వలంటీర్లు పింఛను ఇవ్వకుండా అడ్డుకోవడంతో ఈ నెల పింఛను నగదు 7,725 మందికి నేరుగా వారి బ్యాంకు ఖాతాకు ప్రభుత్వం జమ చేసింది. మంచానికే పరిమితమైన వారు, దివ్యాంగులు 2,609 మందికి ఇంటికి వెళ్లి సచివాలయ సిబ్బంది పింఛను నగదు అందజేస్తున్నారు. బ్యాంకుల వద్ద పింఛనుదారులు నగదు తీసుకునేందుకు బారులు తీరుతున్నారు. కొందరు బ్యాంకు వద్దకు వెళితే బ్యాంకు ఖాతా లావాదేవీలు కొంతకాలంగా లేని కారణంగా హోల్డ్‌లో పెట్టామని బ్యాంకర్లు సమాధానం ఇస్తున్నారు. ఆధార్ జిరాక్స్, పాస్‌ఫోటో తీసుకురావాలని సూచిస్తున్నారు.కొన్ని చోట్ల రద్దీగా ఎక్కువగా ఉందని, నాలుగు రోజులు ఆగి రమ్మని సిబ్బంది చెప్పడంతో ఉసూరుమంటూ పింఛనుదారులు వెనుతిరుగుతున్నారు. పింఛను డబ్బులు చేతికి అందుతాయో, అసలు పింఛనే రద్దవుతుందా అనే ఆందోళన కొందరు లబ్ధిదారులున్నారు.

టీడీపీ వస్తే..మళ్లీ పింఛను కష్టాలు



గత టీడీపీ ప్రభుత్వంలో పంచాయతీ కార్యాలయాలు, పోస్టాఫీసుల వద్ద ఎండలో నిలబడి పింఛన్లు తీసుకున్నాం. చంద్రబాబు హయాంలో పింఛను నగదు పొందడానికి ఎన్ని ఇబ్బందులు పడ్డామో.. ఇప్పుడు అవే ఇబ్బందులు పడుతున్నాం. ఇక సైకిల్‌కు ఈసారి ఓటేస్తే.. ప్రతి నెలా బ్యాంకుల చుట్టూ పంచాయతీ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిందే.

– షేక్ అక్తర్, పింఛనుదారు.

మైనార్టీల అభివృద్ధి వైఎస్సార్ సీపీతోనే సాధ్యం

ప్రత్తిపాడు అభ్యర్థి బలసానికి కిరణ్ కుమార్ ఎన్నికల ప్రచారం



ప్రచార ర్యాలీలో అభివాదం చేస్తున్న అభ్యర్థి బలసాని

కొమ్మూరు(కాకుమాను): మైనార్టీల అభివృద్ధి వైఎస్సార్ సీపీతోనే సాధ్యమవుతుందని ఆ పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ అభ్యర్థి బలసాని కిరణ్ కుమార్ పేర్కొన్నారు. మండలంలోని కొమ్మూరు, పెద్దివారిపాలెం, గార్లపాడు గ్రామాల్లో శుక్రవారం రాత్రి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దివంగత నేత డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి మైనార్టీలకు నాలుగు శాతం రిజర్వేషన్ కల్పించి, వారిని అన్ని విధాలుగా ఆదుకున్నారని తెలిపారు. మైనార్టీల రిజర్వేషన్‌లను ఎత్తివేస్తామని బహిరంగంగా కూటమి పార్టీ ప్రకటన చేసిందని ఆయన గుర్తుచేశారు. రానున్న ఎన్నికల్లో ముస్లిం మైనార్టీలందరూ టీడీపీ తగిన బుద్ధి చెప్పాలన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని మసీదులు, చర్చిలు, దేవాలయాల్లో బలసాని ప్రత్యేక ప్రార్థనలు, పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కొమ్మూరు సర్పంచ్ గేరా జ్యోతి, ఎంటీటీసీ గేరా అలేఖ్య, ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు, జెడ్పీటీసీ ముజావర్ షేక్ గుల్జార్ బేగం , వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా కార్యదర్శి షేక్ అసదుల్లా, వక్ఫ్ బోర్డు డైరెక్టర్ పొన్నూరు షేక్ కరిముల్లా, వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ నల్లమోతు శివరామకృష్ణ, గేరా పున్నారావు, నన్నపనేని కిషోర్‌బాబు, సుబ్బారావు, రవిబాబు, సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు వింతా రాఘవరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు పెదపూడి కపిల్, సుబ్బారావు, యోహోను, సుభాని పాల్గొన్నారు.

వంద కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలోకి



పార్టీలో చేరిన వారితో బలసాని కిషోర్, కొరిటపాటి ప్రేమ్‌కుమార్

గుంటూరు రూరల్: గోరంట్ల గ్రామం ఎస్సీ కాలనీలోని టీడీపీకి చెందిన నాయకులు, కార్యకర్తల వంద కుటుంబాలు శుక్రవారం వైఎస్సార్ సీపీలో చేరాయి. నగరంలోని జేకేసీ కళాశాల రోడ్డులోని ప్రత్తిపాడు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్ క్యాంపు కార్యాలయంలో అభ్యర్థి సోదరుడు బలసాని కిషోర్ వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో ప్రత్తిపాడు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేసి, జగనన్నకు గిఫ్ట్‌గా ఇద్దామని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి, మాదిగ మహాసేన వ్యవస్థాపక అధ్యక్షుడు కొరిటపాటి ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు ప్రోత్సాహంతో మరింత రాణింపు

ఏఎన్‌యూ ప్రొఫెసర్ పూర్ణచంద్రరావు



విద్యార్థులతో పూర్ణచంద్రరావు, ఎస్వీ రమణ, లలిత తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రతిభావంతులను ప్రోత్సహించడం ద్వారా మరింతగా రాణిస్తారని ఏఎన్‌యూ టూరిజం, ట్రావెల్ మేనేజ్‌మెంట్ విభాగ ప్రొఫెసర్ డాక్టర్ పి. పూర్ణచంద్రరావు పేర్కొన్నారు. ఏఎన్‌యూ ఇటీవల ప్రకటించిన ఎంబీఏ, ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ కోర్సుల ప్రథమ సెమిస్టర్ ఫలితాల్లో అత్యధిక ఉత్తీర్ణత సాధించిన అమరావతి రోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాల విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను బహూకరించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న పూర్ణచంద్రరావు మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధతో చదివి, మంచి నడవడిక అలవర్చుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ మాట్లాడుతూ పరీక్షలకు హాజరైన విద్యార్థులందరు డిస్టింక్షన్‌లో ఉత్తీర్ణులయ్యారని చెప్పారు. వారిలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ టీడీ విమల తన భర్త డాక్టర్ చల్లా సత్యనారాయణమూర్తి పేరుతో స్మారక నగదు బహుమతులను అందజేశారని తెలిపారు. ఎంబీఏ విభాగంలో మువ్వల అనూష ప్రథమ బహుమతి, బడుగు నవ్యశ్రీ, గొరిగో దేవిక ద్వితీయ, తాటిపాకల మౌనశ్రీ తృతీయ బహుమతి పొందారని వివరించారు. ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ విభాగంలో గుంటి సైబ్లీ ప్రథమ బహుమతితో పాటు ముదమాల నవ్యశ్రీ, జరపాల శిరీష బాయ్ ద్వితీయ, గంగుల లీలా వెంకట్ తృతీయ బహుమతి అందుకున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంబీఏ విభాగాధిపతి వి. చక్రవర్తి, ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ కె. లలిత, అసోసియేట్ ప్రొఫెసర్లు డి. కళ్యాణి, ఎస్. గోపి శ్రీనివాసరావు, సీహెచ్ వైష్ణవి, ఏ.బాజీబాబు, సీహెచ్ వేదవతి, మణికంఠ, బి. అనిత, అభిలాష్ పాల్గొన్నారు.

మైనారిటీ సబ్ కోటా రద్దుపై మాట్లాడటం సిగ్గు చేటు

లక్ష్మీపురం: జాతీయస్థాయిలో ఓబీసీ రిజర్వేషన్లలో మైనారిటీ సబ్ కోటా రద్దుపై నోరు ఎత్తని రాజకీయ పార్టీలు ఈరోజు దాదాపు 12 సంవత్సరాల తర్వాత ఎన్నికల సమయంలో మాట్లాడటం సిగ్గు చేటు అని ముస్లిం యునైటెడ్ ఫ్రంట్, ముస్లిం జేఏసీ అధ్యక్షులు మహమ్మద్ కలీం పేర్కొన్నారు. స్థానిక తూర్పు నియోజక వర్గ పరిధిలోని కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 4శాతం రిజర్వేషన్లు కల్పించడంపై దాదాపు రాష్ట్రంలోని అన్ని బీసీ సంఘాలు స్వాగతిస్తూ ప్రకటనలు ఇచ్చాయి. సఖ్యతగా ఉంటున్న బీసీ, ముస్లిం వర్గాల మధ్య రాజకీయ చిచ్చు కోసం ఇటువంటి ప్రయత్నాలు చేయటం తగదని చెప్పారు. 2012లో న్యాయస్థానాన్ని ఆశ్రయించిన ఆర్ కృష్ణయ్య ను 2014లో తెలంగాణ ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటన చేసి ఎమ్మెల్యే గా పోటీ చేయించిన పార్టీ కు ఆ పార్టీలో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు గుర్తుకు రాని జాతీయ స్థాయిలో ఓ బి సి కోటాలో మైనారిటీ సబ్ కోటా రిజర్వేషన్ల రద్దు, ఇప్పుడు గుర్తుకు రావడం అందులోనూ ఎన్నికల సమయంలో గుర్తుకు రావటం కేవలం ఎన్నికల జిమ్మిక్కు అని స్పష్టంగా అర్థమవుతుందని తెలిపారు.